ఆకాశవాణి హైదరబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 25-04-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండురోజుల భారత్ సమ్మిట్ , హైదరాబాద్ లోని HICC లో ఈ ఉదయం ప్రారంభమైంది.

2. జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మ్రుతి చెందిన వారికి వారి స్వస్థలాల్లో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.

3. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అవగాహన లోపంతో ముందుకు వెళ్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు.

4. రాష్ట్రంలో రాబోయే రెండు రోజుల్లో వడగాలులు , రాత్రిపూట వేడి వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో , ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

**భారత్ సమ్మిట్:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండురోజుల భారత్ సమ్మిట్, హైదరాబాద్ లోని HICC లో ఈ ఉదయం ప్రారంభమైంది. దాదాపు వంద దేశాలనుంచి 450 మంది ప్రతినిధులు ఈ అంతర్జాతీయ ప్రగతిశీల సదస్సుకు హాజరయ్యారు. ఈ సాయంత్రం జరిగే ప్లీనరీ సదస్సులో AICC అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ కీలకోపన్యాసం చేయనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. వివిధ దేశాలనుంచి వచ్చిన ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న వివిధ సమకాలీన అంశాలపై ప్రగతిశీల వాద పార్టీలు , మేధోవర్గాలు తమ అనుభవాలనూ, అలోచనలనూ పంచుకుంటున్నారు. జండర్ జస్టిస్ - ఎ ఫెమినిస్ట్ ఫ్యూచర్ అన్న అంశంపై జరిగిన చర్చలో మన దేశంతో పాటూ , అర్జెంటీనా, స్వీడన్, మంగోలియా

ప్రతినిధులూ మహిళాల స్థితిగతులు, లింగ వివక్షను రూపుమాపే చర్యలపై చర్చించారు. స్థానిక సంస్థలలో మహిళలకు రిజర్వేషన్లు  అతర్జాతీయ శాంతి చర్చల్లో మహిళల పాత్ర పెరగాలని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. కాగా భారత్ సమ్మిట్ కు హాజరయిన పలువురు ప్రతినిధులు మాహాత్మాగాంధీ ఉపాధి హామీ పధకం  , ఇందిరా మహిళా శక్తి బజార్ పని తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారని మా ప్రతినిధి M S లక్ష్మి తెలియజేశారు.
(MSL)

**సంగారెడ్డి-విదేశీ ప్రతినిధులు**

భారత్ సమ్మిట్ 2025లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన 25 మంది విదేశీ ప్రతినిధులు ఈ రోజు సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం సూరారం గ్రామాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. గ్రామాల్లో ప్రజల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎలా పనిచేస్తున్నాయో అవగాహన కోసం ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. విదేశీ ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఫోటో ప్రదర్శన ద్వారా ఉపాధి పనుల వివరాలు తెలియజేశారు.
(పీటీసీ, సంగారెడ్డి)

**ఉగ్రదాడి-అంత్యక్రియలు**

జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మ్రుతి చెందిన వారికి వారి స్వస్థలాల్లో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఉధ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంకు చెందిన చంద్రమౌళి భౌతిక కాయానికి ఆ రాష్ట్ర హోం మంత్రి అనిత , వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ నివాళులు అర్పించారు. అనాకపల్లి ఎంపీ సీఎం రమేశ్ , అధికార, ప్రతిపక్ష పార్టీ నేతలు కూడా నివాళులు అర్పించి చంద్రమౌళి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మరోవైపు నెల్లూరు జిల్లా కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన్ అంత్యక్రియలు ఈ ఉదయం ముగిశాయి. మధుసూదన్ కుటుంబస భ్యులను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాల

ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి , సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అధికారులు మధుసూదన్ భౌతిక కాయం అంతిమయాత్రలో పాల్గొన్నారు.
(డెస్క్)

**ఎమ్మెల్సీ-మజ్లిస్**

హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో మజ్లిస్ పార్టీ అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హాసన్ విజయం సాధించారు. బీజేపీకి చెందిన ప్రత్యర్థి ఎన్. గౌతమ్ రావుపై 38 ఓట్ల ఆధిక్యంతో గెలుపుపొందారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేశారు. అనుమతించిన 88 ఓట్లకు గాను మజ్లిస్ పార్టీ అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హాసన్ 63 ఓట్లు సాధించారు. గౌతమ్ రావుకు 25 ఓట్లు లభించాయి. కాగా , మీర్జా రియాజ్ ఎన్నికను ఎన్నికల సంఘం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.
(డెస్క్)

**మలేరియా దినోత్సవం-రాజనర్సింహ్**

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా , మలేరియా నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ పిలుపునిచ్చారు. మలేరియా నిర్మూలనలో భాగంగా దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణ కోసం ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకొని మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు.
(SANGAREDDY. PTC)

**హన్మకొండ- ఎర్రబెల్లి దయాకర్ రావు**

కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు దూరదృష్టితో పాలన సాగిస్తే , రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అవగాహన లోపంతో ముందుకు వెళ్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం హన్మకొండ జిల్లా హసన్పర్తి మండలం దేవన్నపేట 65వ డివిజన్‌లో నిర్వహించిన ఎడ్లబండ్ల ర్యాలీలో దయాకర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లుండి జరిగే ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

(వరంగల్ జిల్లా పీటీసి)

**కొవ్వొత్తుల ర్యాలీ**

పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ రోజు సాయంత్రం హైదరాబాద్ లో జరిగే కొవ్వొత్తుల ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారు.. ఏఐసీసీ పిలుపు మేరకు ఈ సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ నెక్లస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకూ ఈ ర్యాలీ నిర్వహించనున్నారు.

(డెస్క్)

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే రెండు రోజుల్లో వడగాలులు ,రాత్రిపూట వేడి వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్ , కొమరం భీమ్ ఆసిఫాబాద్ , మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. కరీంనగర్ , పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి , ములుగు, భద్రాద్రి కొత్తగూడెం , ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి , రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు పసుపు హెచ్చరిక చేసింది. ఈ జిల్లాల్లో

తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు , ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని తెలిపింది.

(డెస్క్)

**జగిత్యాల-బంద్**

పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఈరోజు బంద్ పాటిస్తున్నారు. ఉదయం నుంచే వ్యాపారులు తమ దుకాణాలను  తెరవకుండా నిరసన వ్యక్తం చేశారు. అఖిల పక్షం ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి బంద్ లో పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు.

(జగిత్యాల జిల్లా, పీటీసీ)

**నిర్మల్ జిల్లా- పోషణ్ పక్వాడ్ సౌండ్ బైట్**

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామని జిల్లా ఇన్చార్జ్ సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్ తెలిపారు. చిన్నారులకు పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచి పోషకాహారం అందించాలని అవగాహన కల్పించినట్టు ఆకాశవాణికి తెలిపారు.

(బైట్ సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్)

(పిటిసి నిర్మల్ జిల్లా)

**క్రికెట్**

ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా ఈ రోజు రాత్రి చెన్నైలోని చెపాక్ స్టేడియంలో జరిగే మ్యాచ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు చెన్నై సూపర్ కింగ్స్ తో తలపడుతుంది. ఇప్పటిదాకా ఆడిన ఎనిమిది మ్యాచ్ ల్లో ఇరు జట్లూ చెరో రెండు విజయాలు సాధించి , ఆరింటిలోఓడిపోయాయి. చెరో నాలుగు పాయింట్లతో పట్టికలో సన్ రైజర్స్ , చెన్నై సూపర్ కింగ్స్  9,10వ స్థానాల్లో నిలిచాయి. మరోవైపు నిన్న రాత్రి బెంగళూరులోని చిన్నస్వామి

స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు 11 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్‌స్ పై విజయం సాధించింది.
(డెస్క్)

**వరంగల్- కమిషనర్**

గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో గ్రీన్ ల్యాండ్స్ ఆక్రమణలను నియంత్రించేందుకు వాటి చుట్టూ ఇనుప ముళ్ల కంచెలు ఏర్పాటు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. ఈరోజు కమిషనర్ ఎల్లాపూర్‌లో ఉన్న జీడబ్ల్యూఎంసీ నర్సరీని ఆకస్మికంగా సందర్శించి, నిర్వహణ తీరును పరిశీలించారు.
(పీటీసీ, వరంగల్)

**జాబ్ మేళా-కామారెడ్డి**

కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో HCL టెక్నాలజీస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. సాఫ్ట్ వేర్ రంగంలో స్థిరపడాలనుకునే వారికి ఇదో మంచి అవకాశమని, దీనికి 2024- 2025 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తైన రు అర్హులని తెలిపారు. సమాచారం 8074065803, 7981834205 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.
(PTC – కామారెడ్డి)

**మంచిర్యాలలో భారీ అగ్ని ప్రమాదం**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఓ ప్లాస్టిక్ గోదాంలో ఈరోజు తెల్లవారు జామున అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.. ఎంసీసీ క్వారీ రోడ్డులో ఉన్న ఈ గోదాంలో భారీగా నిల్వ ఉన్న ప్లాస్టిక్ , తుక్కు సామాగ్రి పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది గంటల పాటు శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. గోదాం

చుట్టూ దట్టమైన పొగ వ్యాపించి స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రాథమిక అంచనాల ప్రకారం , ప్రమాదంలో సుమారు రెండు కోట్ల రూపాయల మేరకు ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది.
(పిటిసీ మంచిర్యాల జిల్లా)

**ఆసిఫాబాద్ -కార్డెన్ సెర్చ్**

నేరాల నియంత్రణ కోసం గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ సీఐ రమేష్ తెలిపారు. జిల్లాలోని సిర్పూర్ (యు)లోని సేవదాస్ నగర్ గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని ఆరు ద్విచక్ర వాహనాలు , ఒక ఆటో స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. లీటర్ల గుడుంబా స్వాదీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.
(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

**ఆసిఫాబాద్ -గతి శక్తి**

ప్రధానమంత్రి గతి శక్తి పోర్టల్‌లో ఆసిఫాబాద్ జిల్లాకు సంబంధించిన శాఖల సమాచారం తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి పేర్కొన్నారు. కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ , జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు , వాటిలోని సౌకర్యాలు , ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , అంగన్వాడీ కేంద్రాలు , రహదారులు, త్రాగునీటి వనరుల వంటి వివరాలను గతి శక్తి పోర్టల్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తద్వారా సౌకర్యాలు లేని గ్రామాలను ఎంపిక చేసి అవసరమైన సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు.
(పీటీసీ, ఆసిఫాబాద్)